## క్లుప్తంగా

### తూనికలు, కొలతల అధికారుల తనిఖీలు



ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న తూనికలు, కొలతల అధికారి దివ్య

నగరి : నగరి పట్టణంలోని పలు దుకాణాల్లో గురువారం తూనికలు, కొలతల లీగల్ ఇన్‌స్పెక్టర్ దివ్య ఆకస్మిక తనిఖీ చేశారు. 4 బియ్యం దుకాణాలను తనిఖీ చేసిన ఆమె ఒక దుకాణంలో 26 కేజీల బ్యాగు బరువు 25 కేజీలే ఉండడంతో రూ.40 వేలు జరిమానా విధించారు. రెండు ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేసిన ఆమె ఒక షాపులో ఎమ్మార్పీ రూ.266 ఉండగా రూ.300లకు విక్రయిస్తుండడంతో రూ.10 వేలు జరిమానా విధించారు. తరచూ తనిఖీలు నిర్వహిస్తానని నిబంధనల మేరకు కొలతలు, ధరలు లేకుండా చర్యలు తప్పవంటూ హెచ్చరించారు.

### పంచాయతీ రాజ్ డీఈగా జయచంద్రారెడ్డి



గంగాధరనెల్లూరు: నియోజకవర్గం పంచాయతీ రాజ్ డివిజినల్ ఇంజినీర్‌గా జయచంద్రారెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయన గుడిపాల ఏఈగా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై జీడీనెల్లూరు నియోజకవర్గం డీఈగా చేరారు. గతంలో డీఈగా పనిచేసిన చేస్తున్న దయాకర్‌రెడ్డి అన్నమయ్య జిల్లా రాయచోటికి ఈఈగా పదోన్నతిపై వెళ్లారు. నూతన డీఈగా బాధ్యతలు చేపట్టిన జయచంద్రారెడ్డిని, అలాగే పదోన్నతిపై ఈఈగా వెళ్తున్న దయాకర్‌రెడ్డిని కార్యాలయ సిబ్బంది శాలువలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూతన డీఈ మాట్లాడుతూ పంచాయతీ రాజ్ తరపున ఎక్కడా ఇబ్బంది లేకుండా అధికారులు పని చేయాలని సూచించారు.

### వేలంతో రూ.17.05 లక్షల ఆదాయం



మీసాలురెడ్డి

పుత్తూరు రూరల్: స్థానిక శ్రీద్రౌపదీదేవి సమేత శ్రీధర్మరాజుల స్వామి ఆలయ తోపు లీజును రూ.17.05 లక్షలకు వైఎస్సార్‌సీపీ నాయకులు మీసాలురెడ్డి దక్కించుకున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ లారీ మోహన్ తెలిపారు. గురువారం టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సుమనప్రియ సమక్షంలో బహిరంగ వేలం నిర్వహించినట్లు తెలిపారు. గత ఏడాది తోపు వేలం ద్వారా రూ.12.70 లక్షల ఆదాయం రాగా, ఈసారి రూ.17.05 లక్షలకు పెరిగిందన్నారు. ఆగస్టు 18వ తేదీ నుంచి 28 వరకు 10 రోజుల పాటు ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా తోపు ఆవరణలో తాత్కాలిక అంగళ్ల నిర్వహణ కోసం తోపును లీజుకు ఇవ్వడం జరిగిందని వెల్లడించారు.

### పాముకాటుకు వ్యక్తి మృతి



జనార్దన్

నింద్ర: మండలంలోని ఎలకాటూరు గ్రామానికి చెందిన జనార్దన్(30)ను బుధవారం రాత్రి ఇంట్లో పడుకుని ఉండగా పాము కాటు వేయడంతో మృతి చెందాడు. మృతుడి భార్య సుధ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుధవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న తన భర్తను పాముకాటు వేయడంతో మృతి చెందినట్లు ఆమె తెలిపారు.

### వైభవంగా ధర్మరాజుల స్వామి ఊరేగింపు



పుష్ప పల్లకిలో ఊరేగుతున్న ధర్మరాజు స్వామి

పిచ్చాటూరు: మండలకేంద్రంలో జరుగుతున్న ధర్మరాజుల తిరునాళ్లలో భాగంగా గురువారం ధర్మరాజుల ఊరేగింపు పట్టణ ప్రజలను కనువిందు చేసింది. ఉదయం నుంచి ఆలయంలో మహాభారత కథలో శ్రీకృష్ణుడు యుద్ధానికి ముందు కౌరవుల వద్దకు సంధికి వెళ్లే ఘట్టాన్ని ఆలపించారు. ఆలయంలోని ధర్మరాజుల ఉత్సవమూర్తికి ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. సాయంత్రం స్వామివారి ఉత్సవమూర్తిని పల్లకిలో అమర్చి వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరించి మంగళవాయిద్యాలు, గెరిగ నృత్యాలు, బాణసంచా పేలుళ్ల నడుమ పట్టణంలో ఊరేగించారు. భక్తులు పిండివంటలను స్వామి వారికి నైవేద్యంగా సమర్పించారు. కంకణం ధరించిన దీక్షాపరులు స్వామివారి సేవలో తరించారు. రాత్రి ఆలయ ప్రాంగణంలో మహాభారతం వీధి నాటకం ప్రజలను ఆకట్టుకుంది. సర్పంచ్ కేజీ రోస్ రెడ్డి మాట్లాడుతూ శుక్రవారం ఉదయం 7 గంటలకు అర్జున తపస్సు, 11 గంటలకు మహిళల పాల ముంతల ఊరేగింపు, మధ్యాహ్నం ధర్మరాజుకు పాలాభిషేకం ఉంటుందన్నారు.

# సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి



పుత్తూరులో సర్టిఫికెట్లు అందుకున్న లబ్ధిదారులతో మంత్రి రోజా



పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరంలో పాల్గొన్న మహిళలు

- నాలుగేళ్లలో ఇచ్చిన ప్రతిహామీని సీఎం జగనన్న నెరవేర్చారు
- వచ్చే ఎన్నికల్లో దొంగలంతా ఏకమై వస్తారు
- పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా

నింద్ర/పుత్తూరు రూరల్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధిదారుల ఇళ్ల వద్దకే అందిస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదే అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక వ్యవహారాల శాఖ మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. గురువారం పుత్తూరు మునిసిపాలిటీ, నింద్ర మండలం పాదిరి సచివాలయ పరిధిలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జగనన్న లాంటి గొప్ప వ్యక్తి మన రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండడం ప్రజల అదృష్టం అని అన్నారు. ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు అందించాలన్న ఉద్దేశంతో సీఎం జగనన్న సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను ఏర్పాటు చేశారన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి వలంటీర్లు ప్రజల అర్హత ఆధారంగా వారికి సంక్షేమ పథకాలను అందిస్తున్నారని తెలిపారు. ఇప్పటికే మారుమూల గ్రామాలకు సైతం రోడ్లను వేశామన్నారు. అభివృద్ధే ధ్యేయంగా సీఎం జగనన్న పాలన సాగిస్తున్నారన్నారు. ప్రజాసమస్యలను తెలుసుకోవడానికి మంత్రులు, ఎమ్మెల్యేలు గడప గడపకు వెళ్తూ జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందాయా ? సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చేశామన్నారు.

**ప్రతి హామీ నెరవేరుస్తున్నాం..**

2014 ఎన్నికల్లో తనకు 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉందని, ఢిల్లీలో చక్రం తిప్పానని, సెల్‌ఫోన్ తానే కనిపెట్టానని అబద్ధపు మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఆ తరువాత హామీలను గాలికొదిలి ప్రజలను నిలువునా ముంచారని మంత్రి ఆర్‌కే రోజా ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో దొంగలంతా ఏకమై వస్తారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. నిత్యం ప్రజల సంక్షేమం కోసం పాటు పడుతున్న జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీని జగనన్న నెరవేర్చారని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న ప్రతి కుటుంబాన్ని కూడా తన సొంత కుటుంబంగా భావించి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగనన్నే అని అన్నారు. అలాగే పాదిరి సచివాలయ పరిధిలో సంక్షేమ పథకాల ద్వారా రూ.6 కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. అలాగే సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు రూ.8 కోట్లు మేర అందించామన్నారు. ఈ సందర్భంగా జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా 22 మందికి ఆధార్ లింకింగ్, 443 మందికి వివిధ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దీప, మండల ప్రత్యేక అధికారి సతీష్‌కుమార్,



పాదిరి: సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న మంత్రి రోజా

ఎంపీడీఓ అరుణ, హౌసింగ్ డీఈ శంకరప్ప, ఏఈ శ్రీధర్ రాజు, తహసీల్దార్ అమరేంద్రబాబు, వైఎస్సార్‌సీపీ యువజన కార్యదర్శి శ్యామ్‌లాల్, వైస్ ఎంపీపీ శుభ, ఎంపీటీసీ రమ్య, సర్పంచ్ సూర్య, కోఆప్షన్ సభ్యులు అనిల్‌కుమార్, ఎంపీటీసీ సభ్యులు విజేష్, మండల సచివాలయ కన్వీనర్ బాబురెడ్డి, మండల కన్వీనర్ వేణురాజు, ఎస్సీసెల్ అధ్యక్షుడు దామోదరం, సింగిల్‌విండో అధ్యక్షుడు మునికృష్ణారెడ్డి, ఆర్‌బీకే చైర్మన్ వీరయ్య, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

### 30న తులసీ మహత్యం ఉత్సవం

తిరుపతి కల్చరల్: గోవిందరాజస్వామి ఆలయంలో 30వ తేదీన తులసి మహత్యం ఉత్సవం నిర్వహించనున్నారు. స్వామివారికి తులసి దళం అత్యంత ప్రీతికరమైంది. శ్రావణ శుద్ధ ద్వాదశినాడు తులసి ఆవిర్భావం జరిగిన సందర్భాన్ని పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఉదయం 7.30 నుంచి 8.30 గంటల వరకు గోవిందరాజస్వామి గరుడ వాహనాన్ని అధిరోహించి ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిస్తారు. అనంతరం 9.30 నుంచి 10.30 గంటల వరకు స్వామి వారి ఆస్థానం ఘనంగా జరుగనుంది. ఇందులో అర్చకులు తులసి మహత్యం పురాణాన్ని పఠిస్తారు.

### తాళపత్ర గ్రంథాల సంరక్షణకు చర్యలు

తిరుపతి సిటీ: తాళపత్ర గ్రంథాలను 1956 నుంచి పసిబిడ్డలా సంరక్షిస్తున్నామని ఎస్వీయూ వీసీ రాజారెడ్డి పేర్కొన్నారు. ఆయన గురువారం టీటీడీ డీఈవో భాస్కర్‌రెడ్డితో కలిసి యూనివర్సిటీలోని ప్రాశ్చ పరిశోధనా సంస్థను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ఎస్వీయూలోని ప్రాశ్చ పరిశోధనా సంస్థకు ఎంతో విశిష్టత ఉందన్నారు. శాసనమండలి కమిటీ, న్యాక్ కమిటీ సంస్థ విశిష్టతను పరిశీలించి సెంటర్ ఫర్ ఎక్స్‌లెన్స్‌గా గుర్తించారని చెప్పారు. కార్యక్రమంలో పరిశోధనా సంస్థ సంచాలకులు పీసీ వెంకటేశ్వర్లు, రాజశేఖర్, వెంకటేష్ పాల్గొన్నారు.

## మణిపూర్ మానవ మృగాలను ఉరితీయాలి



రౌండ్‌టేబుల్ సమావేశంలో అఖిలపక్ష నాయకులు

నగరి : మణిపూర్‌లో మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడి హత్యలు చేసిన మానవ మృగాలను ఉరితీయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య అన్నారు. గురువారం సీపీఐ పార్టీ సమితి ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న మహిళలను వివస్త్రలను చేయడం, అత్యాచారాలకు, హత్యలకు పాల్పడడం లాంటి సంఘటనలకు ఆ రాష్ట్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉండడమే కారణమన్నారు. అందుకు కారణమైన దుర్మార్గులను కఠినంగా శిక్షించాలని, అలాగే ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి వీరేంద్ర సింగ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అఖిలపక్ష పార్టీ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

### సెమిస్టర్-2 పాఠ్యపుస్తకాల పంపిణీ



విద్యార్థులకు సెమిస్టర్-2 పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం మనోహర్‌నాయుడు

పాలసముద్రం : ప్రభుత్వం నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం మండల పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం ఎంఈఓ రాజేంద్రప్రసాద్, ఉన్నత పాఠశాల హెచ్‌ఎంలు సెమిస్టర్-2 పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. బలిజకండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మనోహర్‌నాయుడు మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం విద్యకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి విద్యార్థుల చదువులకు కావలసిన పాఠ్యపుస్తకాలు మందుస్తుగానే సెమిస్టర్-2 పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తుందన్నారు. అందువల్ల విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకుని విద్యలో ఉన్నతస్థాయికి ఎదగాలని తెలిపారు. అనంతరం విద్యార్థులకు సెమిస్టర్-2 పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఘనంగా పుష్కర కుంభాభిషేకం



పట్టువస్త్రాలను తీసుకొస్తున్న మహిళలు



కుంభాభిషేక పూజలు నిర్వహిస్తున్న పండితులు

పుత్తూరు రూరల్: స్థానిక బజారువీధిలో వెలసిన పిడి కిలి గంగమ్మ ఆలయ పుష్కర కుంభాభిషేకం గురువా రం ఘనంగా ప్రారంభమైంది. ఉదయం గణపతిపూ జ, పుణ్యావహవాచనం, రక్షాబంధనం, అంకురార్ప ణ, కలశస్థాపన, గణపతి హోమం, లఘుపూర్ణాహుతి, హారతి కార్యక్రమాలు నిర్వహించారు. అంతకుముందు తరుణ గణపతి ఆలయం తరపున అమ్మవారికి పట్టువస్త్రాలను మహిళలు ప్రదర్శనగా తీసుకొచ్చారు. శుక్రవారం ఉదయం 5 గంటలకు దీక్షా హోమాలు, పూర్ణాహుతి, కుంభోద్వాసన నిర్వహించనున్నారు. 8 గంటలకు గోపూజ, ఆలయప్రదక్షిణ, త్రిశూలానికి, మహాద్వారానికి కుంభాభిషేకం, అర్చన జరుగుతాయి.

## జగనన్న సురక్షతో ప్రజలకు మేలు



ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న ఎంపీపీ అనిత



ధ్రువపత్రాలు అందజేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

గంగాధరనెల్లూరు: రాష్ట్ర ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎంపీపీ అనిత అన్నారు. గురువారం మండల పరిధిలోని బుక్కపట్నం సచివాలయంలో సర్పంచ్ మునిరాజారెడ్డి ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకునే రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయాల ద్వారా జగనన్న సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేసి నెల రోజుల పాటు అధికారులు గ్రామాల్లోకి వెళ్లి 11 రకాల ధ్రువపత్రాలను ఉచితంగా మంజూరు చేసేలా కార్యాచరణ రూపొందించారని గుర్తుచేశారు. అనంతరం దరఖాస్తు చేసుకున్న వారికి ధ్రువపత్రాలను అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఇన్బనాథన్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**కార్వేటినగరంలో..**

కార్వేటినగరం: రాష్ట్రంలో జగనన్న సర్రక్ష కార్యక్రమం నూతన అధ్యాయానికి నాంది పలికిందని ఎంపీటీసీ రాధికారెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని కొటార్వేడు, గాజంకి గ్రామ సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మోహనమురళి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజల ఇళ్ల ముంగిటకే తీసుకొచ్చారన్నారు. అనంతరం దరఖాస్తు చేసుకున్న వారికి ఉచితంగా వివిధ ధ్రువీకరణ పత్రాలను అందించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు హరోహరరెడ్డి, చిన్నబ్బరెడ్డి, శీలా రాణి, ఎంపీటీసీ విమల, ప్రత్యేక అధికారి త్రిశూల్, తహసీల్దార్ రవికుమార్, డీటీ లక్ష్మీపతి, పంచాయతీ కార్యదర్శులు వాణి, మనోగ్ని, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ప్రజాప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

### విద్యాసామగ్రి వితరణ



విద్యాసామగ్రిని అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు హరీష్

గంగాధరనెల్లూరు: విద్యార్థులు ఇష్టపడి చదివినప్పుడే ఉన్నతస్థాయికి చేరుకుంటారని వైఎస్సార్‌సీపీ నాయకుడు హరీష్ అన్నారు. ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ ఎంసీ విజయానందరెడ్డి ఆదేశాల మేరకు మండల పరిధిలోని ఉన్నత పాఠశాల విద్యార్థులకు విద్యాసామగ్రిని అందించారు. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ ఎంసీ విజయానందరెడ్డి తన జన్మదినం సందర్భంగా బొకేలు, శాలువలు వద్దని, ఆ డబ్బులతో పేద విద్యార్థులకు విద్యాసామగ్రి అందించాలని ఆదేశించారని తెలిపారు. అందుకే విద్యార్థులకు రూ.10 వేలు విలువ చేసే నోటు పుస్తకాలు, విద్యాసామగ్రిని అందించడం జరిగిందన్నారు.

## జగనన్న ప్రభుత్వంలో నిరీక్షణలు లేవు



సర్టిఫికెట్లు అందుకున్న వారితో రామ్‌ప్రసాద్‌రెడ్డి

నగరి : జగనన్న ప్రభుత్వంలో నిరీక్షణలు లేవని మంత్రి ఆర్‌కే రోజా సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డి అన్నారు. గురువారం నగరి మండలం గుండ్రాజుకుప్పం సచివాలయ పరిధిలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అర్హులైన 741 మందికి వివిధ రకాలైన సర్టిఫికెట్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు పూర్తిస్థాయిలో ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. సర్టిఫికెట్లు సైతం ప్రజలను వెతుక్కుంటూ వారి వద్దకే వస్తుందన్నారు. మంచి చేస్తున్నది ఎవరు ? మాటలతో మభ్యపెడుతున్నది ఎవరని ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి వాసు, తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీడీఓ లీలామాధవి, ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీ కన్నియప్ప, పీఏసీఎస్ చైర్మన్ తిరుమల రెడ్డి, ఆర్బీకే చైర్మన్ బుజ్జిరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ హరి, సర్పంచ్ బాలప్రసాద్ రెడ్డి, నాయకులు భాస్కర్ రెడ్డి, పరశురామ్, దేవరాజులు రెడ్డి, నిరంజన్‌రెడ్డి, లోకనాథరెడ్డి, గుణశేఖర్, గోవర్దన్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

## నేడు ఉప ముఖ్యమంత్రి పర్యటన

వెదురుకుప్పం: మండలంలోని తిరుమలయ్యపల్లె గ్రామ సచివాలయ పరిధిలో ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి శుక్రవారం పర్యటిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభ రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సచివాలయ పరిధిలోని కొండకిందపల్లె, గుర్రంవారికండ్రిగ, పెద్దబైలు, షికారి కాలనీ, సుందరాంగిణిపల్లె, దేవరగుడిపల్లెల్లో జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధితో పాటు ప్రజలు సమస్యలను అడిగి తెలుసుకుంటారని తెలిపారు.

# సీఎం జగనన్న పాలన దేశానికే ఆదర్శం

- విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యం
- సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పాలన
- ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి



పథకాల లబ్ధిని అడిగి తెలుసుకుంటున్న ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి

వెదురుకుప్పం: ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు దేశానికే ఆదర్శనీయమని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి స్పష్టం చేశారు. గురువారం మండలంలోని తిరుమలయ్యపల్లె గ్రామ సచివాలయ పరిధిలోని మొరవ, మోడల్ కాలనీ, తిరుమలయ్యపల్లె, వేణుగోపాలపురం, వడ్డిఇండ్లు, వావిల్‌చేను, చెంచుగుడి, రెంటాలచేను, బాలుపల్లె, రెడ్డేపల్లె, మాకమాంబపురం గ్రామాల్లో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రతి ఇంటి వద్దకు వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధి, ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పథకాల అందించడంలో ఎలాంటి వివక్ష చూపకుండా ఇస్తుంటే కనీసం వార్డు మెంబర్‌గా కూడా గెలవని లోకేష్ అసత్యపు ఆరోపణలు చేయడం సిగ్గు చేటన్నారు. అప్పులు చేసి అభివృద్ధికి వెచ్చిస్తుంటే లేనిపోని విమర్శలు చేయడం భావ్యం కాదన్నారు. 40 ఏళ్లుగా అప్పులు చేసినా ప్రజలకు ఎలాంటి పథకాలు తీసుకురాలేదన్నారు. విద్యాభివృద్ధికి ప్రథమ ప్రాధాన్యం ఇచ్చి ప్రతి పేదవాడికి కార్పొరేట్ స్థాయిలో నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో సమస్యలను గుర్తించి తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు.

**ప్రతి ఒక్కరికీ పథకాలు అందాలి..**

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందాలని, అదే ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. గ్రామాల్లో సిమెంటు రోడ్డు నిర్మాణాలు చేపట్టాలని పీఆర్ ఏఈ మురళిని ఆదేశించారు. గతంలో తిరుమలయ్యపల్లె పంచాయతీకి సిమెంటు రోడ్ల నిర్మాణం కోసం రూ.3.50 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. తిరుమలయ్యపల్లె గ్రామంలో చేపట్టిన సిమెంటు రోడ్లు నాసిరకంగా ఉన్నాయని స్థానికులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన మంత్రి వెంటనే పంచాయతీ రాజ్ శాఖ ఎస్‌ఈకి ఫోన్ చేసి సమస్యను చెప్పారు. పనులను పరిశీలించి నాణ్యతగా చేపట్టారా ? లేదా ? నాసిరకంగా ఉంటే వెంటనే సరి చేయాలని ఆదేశించారు. విద్యుత్ సమస్యలను గుర్తించి పరిష్కరించాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. వావిలచేను గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, తాగునీటి బోరును ప్రారంభించారు. మహిళలు పెద్దఎత్తున పూల వర్షం కురిపించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం ఆయన ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన నాగిరెడ్డిని పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగరాణి, జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్, ఎంపీటీసీలు హరి, చిన్నబ్బ, ఎంపీడీఓ సుధాకరరావు, తహసీల్దార్ సత్యనారాయణ, సర్పంచ్ భారతి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బండి గోవర్ధన్‌రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండి హేమసుందర్‌రెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బట్టే సుబ్రమణ్యం, పారిశ్రామికవేత్త నరసింహారెడ్డి, వైద్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోలార్ ప్రకాష్, నాయకులు పేట ధనంజయరెడ్డి, రామయ్య, భీమశంకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ పురుషోత్తం, ఏఎంసీ డైరెక్టర్లు గోవిందరెడ్డి, రాణెమ్మ, కో-ఆప్షన్ సభ్యుడు వెంకటేష్, రోశిరెడ్డి, హేమచంద్రారెడ్డి, గోపాల్, పట్టాభిరెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

## సంఘమిత్రలతో సమీక్ష



మాట్లాడుతున్న ఐకేపీ ఏపీఎం ఫరీద్ మస్తాన్

పాలసముద్రం : సంఘమిత్రాలు, వీవో లీడర్లు బాధ్యతగా పని చేసి డ్వాక్రా గ్రూపులను ఏ గ్రేడ్‌లో ఉంచాలని ఐకేపీ ఏపీఎం ఫరీద్‌మస్తాన్ తెలిపారు. గురువారం ఐకేపీ కార్యాలయంలో మండల సమాఖ్య సమావేశం జరిగింది. ఏపీఎం మాట్లాడుతూ బ్యాంకు లింకేజీ రుణాలను సక్రమంగా కంతుల ప్రకారం కట్టించాల్సిన బాధ్యత సంబంధిత సంఘమిత్రలపై ఉందన్నారు. స్త్రీనిధి, ఉన్నతి రుణాలు కూడా సక్రమంగా కట్టుకోవాలన్నారు. తీసుకున్న రుణాలను సక్రమంగా కట్టుకుంటే ఒక్కో సభ్యురాలికి రూ.1.50లక్షల వరకు రుణాలు ఇస్తామని తెలిపారు. తీసుకున్న రుణాలను సక్రమంగా వినియోగించుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. కార్యక్రమంలో సీసీ చిరంజీవి, లోకనాథం, సంఘమిత్రలు మురగయ్య, మంజుల, శోభ, వీవో లీడర్లు పాల్గొన్నారు.

## పంటల సాగులో బిజీబిజీ..



గంగమాంబపురం: వరి నాట్లు వేస్తున్న మహిళలు



వెంగళరాజుకుప్పం: వేరుశనగ పంటలో కలుపు తీస్తున్న కూలీలు

పాలసముద్రం : వారం రోజులుగా కురిసిన వర్షాలకు రైతులు రెండో విడతలు దుక్కులు చేసి వరి పంట సాగులో నిమగ్నమయ్యారు. బోరుబావుల కింద రైతులు సుమారు 985 హెక్టార్లలో వరి పంట, సుమారు 657 హెక్టార్లలో వేరుశనగ పంట సాగు చేస్తున్నారు. రైతులు ఏ పంట సాగు చేసిన ఎక్కువగా రసాయన ఎరువులు, పురుగు మందులను వాడడం వల్ల భూములు మొద్దుబారి పోయి దిగుబడి తగ్గిపోతుందన్నారు. ఈ నేపథ్యంలో స్థానికంగా లభించే ఆకులతో జీవామృతం, ఘనజీవామృతం తయారు చేసుకుని పంటకు ఉపయోగిస్తే అధిక దిగుబడి పొందవచ్చన్నారు. అందువల్ల రైతులు చాలావరకు వ్యవసాయ అధికారి సూచనలు పాటిస్తున్నారు.